

అపా(ర్)ర

ఒకే దేశం.. ఒకే విద్యా విధానం లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) పేరుతో విద్యార్థులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తోంది. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభంలో జిల్లాలో మొదలైన ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఎందుకంటే విద్యాసంస్థల్లోని చాలామంది విద్యార్థుల రికార్డులకు.. వారి ఆధార్‌లోని వివరాలు సరిపోలడం లేదు. దీంతో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కష్టాలు మొదలయ్యాయి.

- చిత్తూరు సెంట్రల్/కుప్పం, ఆంధ్రజ్యోతి

కష్టాలు..!



బంగారుపాళ్యం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ముందు ఆధార్‌లో మార్పులకు వేచి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు

47 శాతమే నమోదు

జిల్లాలో ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు 2,85,087 మంది విద్యార్థులు చదువుతుండగా, ఇప్పటి వరకు 1,34,706 మంది (47.25శాతం) వివరాలు మాత్రమే నమోదైంది. ఇందులో ఒకటి నుంచి టెన్త్ వరకు 2,35,928 మంది విద్యార్థులు ఉండగా, ఇప్పటి వరకు 1,24,575 (52.80శాతం) మంది విద్యార్థుల నమోదు పూర్తి చేశారు. అపార్ నమోదులో పాలసముద్రం మండలం 76.14 శాతంతో టాప్‌లో ఉండగా, చౌడేపల్లె మండలం 34.13 శాతంతో లాస్టులో ఉంది.

ప్రయోజనాలివీ

ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల్లో చదివే విద్యార్థులకు ప్రత్యేక ఐడీ నెంబరు కేటాయించి అపార్ కార్డులు జారీ చేస్తారు. విద్యార్థి ఒక చోట నుంచి మరోచోటుకు బదిలీ అయినప్పుడు ఈ కార్డు నంబరు నమోదు చేయగానే పూర్తి వివరాలు తెలుస్తాయి. ఎలాంటి ధ్రువపత్రాలు సమర్పించకుండానే నేరుగా పైతరగతికి అప్‌గ్రేడ్ అయ్యేందుకు మార్గం సుగమం అవుతుంది. ఇప్పటి వరకు చాలా మంది ఒకే సంవత్సరంలో రెండేసి డిగ్రీలు చేసేవారికి, అపార్ కార్డు వల్ల ఇకపై వీలుండదు. ఇదిలా ఉండగా, దేశంలో ఏ రాష్ట్రంలోకి వెళ్ళినా చదువుకునే వెసులుబాటు ఉంటుంది. విద్యార్థి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదు. అపార్ కార్డు నెంబరు నమోదు చేస్తే చాలు ఏ విద్యాసంస్థల్లోనైనా ఇట్టే చేరి, చదువుకునే వీలుంటుంది.

ఒక్క అక్షరం తేడా ఉన్నా కుదరదు

విద్యార్థి పాఠశాలలో చేరే సమయంలో రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేస్తారు. యూడైస్ ప్లస్ యాప్‌లోనూ వివరాలు పొందుపర్చాల్సి ఉంది. తాజాగా అపార్ రావడంతో రిజిస్టర్, యూడైస్ ప్లస్‌లో నమోదు చేసిన వివరాలు ఆధార్ కార్డు వివరాలతో సరిపోవాలి. లేకుంటే విద్యార్థికి అపార్ నమోదు కానట్లే. ఉదాహరణకు ఆధార్‌లో ఒక విద్యార్థి పూర్తి ఇంటిపేరుతో ఉండి, పాఠశాల రిజిస్టర్, యూడైస్‌ప్లస్‌లో కేవలం ఇంటిపేరుకు బదులుగా ఇనిషియల్‌తో పేరు నమోదై ఉంటే ఇక్కడ అపార్ నమోదు చేయడానికి వీలు లేదు. ఆధార్‌లో విద్యార్థి పేరు ఎలా ఉందో అలానే పాఠశాల రిజిస్టర్, యూడైస్‌ప్లస్‌లో నమోదు కావాలి. అదేవిధంగా పుట్టిన తేదీ, తండ్రి పేరు, చిరునామా ఇలా అన్ని వివరాలు ఆధార్‌లో ఎలా ఉంటే అలాగే పాఠశాల రిజిస్టర్, యూడైస్ ప్లస్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఒక్క అక్షరం, ఫుల్‌స్టాప్ తేడా ఉన్నా, అపార్‌లో నమోదు వీలుకాదు. అపార్ యాప్‌లో ఒకసారి ఒక అక్షరం మాత్రమే మార్చడానికి అవకాశం ఉంది. ఎన్ని అక్షరాలు తేడా ఉంటే అన్నిసార్లు నమోదు చేయాల్సి ఉండటం, మరో వైపు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నెట్ సరిగ్గా పనిచేయకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో పాఠశాల, యూడైస్ ప్లస్‌లోని వివరాలను అనుసరించి ఆధార్ కార్డులో మార్పులు చేసేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆధార్ కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది.

కుప్పంలో రూ.5వేలు పలుకుతున్న ఆధార్ అప్డేషన్

కడా పరిధిలో ఆధార్ అప్డేషన్ సెంటర్లు చాలా పరిమితంగా ఉన్నాయి. కుప్పం పురపాలక సంఘంతోపాటు కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాల్లోని ఏ ఒక్క మీ సేవా కేంద్రమూ పనిచేయడం లేదు. కుప్పం పట్టణంలో పోస్ట్ ఆఫీస్, ఎంఎఫ్‌సీ కళాశాల వద్ద గల ఇండియన్ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకుల్లో ఏపీ ఆన్‌లైన్ ఆధార్ సేవా కేంద్రాలున్నాయి. అలాగే కుప్పం మండలంలోని చందం, మల్లానూరు, నడిమూరు, కంగుంది సచివాలయాలు, గుడుపల్లె మండలంలో గుడుపల్లె, శెట్టిపల్లె, రామకుప్పం మండలంలో రామకుప్పం, ముద్దనపల్లె, శాంతిపురం మండలంలో అబకలదొడ్డి, కెమాకులపల్లె సచివాలయాల్లో మాత్రమే ఆధార్ అప్డేషన్ కేంద్రాలు నడుస్తున్నాయి. ఆధార్ అప్డేషన్ అవసరమైన విద్యార్థుల సంఖ్యతో పోలిస్తే, ఈ కేంద్రాలు ఏమూలకూ సాగవు. ఉదాహరణకు కుప్పం మున్సిపాలిటీతోపాటు మండలంలో కలిపి ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి దాకా చదివే విద్యార్థులు సుమారు 26వేలమంది ఉన్నారు. ఇంతమంది విద్యార్థులకు పరిమితంగా ఉన్న ఆధార్ అప్డేషన్ కేంద్రాలు సరిపోవడంలేదు. ఒక్కో అప్డేషన్ కేంద్రం వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చదువులు, పనులు మానుకుని ఉదయంనుంచి సాయంత్రం దాకా క్యూలలో బారులుతీరి కనిపిస్తున్నారు. ఇదే అదనుగా దళారులు బయలుదేరారు. ఈ దళారులు ఆయా ఆధార్ అప్డేషన్ కేంద్రాల వద్ద వాలిపోయి, రూ.5వేలను ఇస్తే రెండు, మూడ్రోజుల్లో అప్డేషన్ చేసి ఇస్తామంటూ విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెడుతున్నారు. గ్రామాలలో కూడా వీరి జోరు ఇటీవల ఎక్కువయింది. నిజానికి ఆధార్ అప్డేషన్‌కోసం సేవా రుసుంగా రూ.50 మాత్రం చెల్లిస్తే సరిపోతుంది. కానీ తల్లిదండ్రులు చాలామంది క్యూలలో నిలువుకాళ్ల కష్టాలు పడలేక ఇటువంటి దళారులను ఆశ్రయించడం ఎక్కువవుతోంది.



కుప్పం పోస్టాఫీస్ వద్ద ఆధార్ అప్డేషన్‌కోసం తల్లిదండ్రుల పడిగాపులు

మీసేవ కేంద్రం చుట్టూ తిరుగుతున్నా



నా కుమార్తె డి.పావని నారాయణ కళాశాలలో ద్వితీయ ఇంటర్ చదువుతోంది. ఆధార్‌లో తండ్రి, తల్లి పేర్లలోని అక్షరాలు తప్పుగా ఉన్నాయి. మార్చడానికి మీ-సేవ కేంద్రం చుట్టూ నెలలుగా తిరుగుతున్నా.

- జీవరత్నం నాయుడు, రైతు, యాదమరి మండలం

బిడ్డ పుట్టిన తేదీలో తప్పుందట

నా బిడ్డ హిమసాగర్ నరహరిపేట జడ్పీహెచ్ఎస్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. పుట్టిన తేదీలో తప్పుందట. బడి రికార్డులో ఓ రకంగా, ఆధార్ కార్డులో మరోరకంగా ఉందంట. దీన్ని సరిచేసేందుకు ఆధార్ కేంద్రం చుట్టూ తిరగాల్సి వస్తోంది.



- గీత, గుడిపాల మండలం

అక్రమాలను అరికట్టడమే ధ్యేయం

- నాన్ జ్యుడీషియల్ స్టాంపుల అమ్మకాలకు కొత్త నిబంధనలు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాన్ జ్యుడీషియల్ స్టాంపుల అమ్మకాల్లో అక్రమాలను అరికట్టడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిబంధనలను అమలు చేసింది. పలువురు వెండర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించి.. స్టాంపు కాగితాలపై పాత తేదీలను వేసిచ్చేవారు.దీంతో న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యేవి. నకిలీ స్టాంపులు ముద్రించి విక్రయించిన సందర్భాలూ అనేకం.వీటన్నింటికీ చెక్ పడనుంది.

> **పకడ్బందీగా స్టాంపుల విక్రయం**
>
> జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు స్టాంపులు సరఫరా చేశాం. వెండర్లు నిబంధనల ప్రకారమే విక్రయించాలి. లేకుంటే చర్యలు తీసుకుంటాం. అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.
>
> - మునిశంకరయ్య, జిల్లా రిజిస్ట్రార్

ఓటీపీ చెబితేనే..

గతంలో మాదిరిగా రికార్డుల్లో రాసి.. స్టాంపులు ఇచ్చే విధానానికి స్వస్తి పలికారు. ప్రతి వెండరు కంప్యూటర్, ప్రింటర్ తప్పనిసరిగా కొనుగోలు చేయాలి. స్టాంపు కాగితాలు కొనాలంటే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. డబ్బులు ప్రభుత్వ ఖాతాలో జమచేయాలి.కంప్యూటర్‌లో నమోదు చేసుకున్నాక వినియోగదారుడి ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ కౌంటర్‌లో చెబితేనే స్టాంపులు ఇస్తారు. ఒక్క స్టాంపు కొనుగోలు చేసినా ఆధార్ నెంబరు తప్పనిసరిగా నమోదు చేయాల్సిందే. ఒక వ్యక్తి 5 నుంచి 10 స్టాంపుల వరకు కొనుగోలు చేయవచ్చు. ఆధార్ నెంబరుతో ఎవరు ఎన్ని స్టాంపులు కొనుగోలు చేశారో తెలుసుకోవచ్చు.

దేవళంపేటలో పంటలపై గజదాడులు

- 75 కొబ్బరి, 17 మామిడి చెట్లు ధ్వంసం



ఏనుగులు విరిచేసిన కొబ్బరిచెట్లు

కల్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా దేవళంపేటలో 75 కొబ్బరి, 17 మామిడిచెట్లను ఏనుగుల గుంపు ధ్వంసం చేయడంతో బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మర్రికుంటవారిపల్లెలోని రైతు వెంకటాచలం 30 ఏళ్ల క్రితం తన నాలుగు ఎకరాల మామిడితోట చుట్టూ కొబ్బరిచెట్లను నాటి వాటి నుంచి ఫలసాయాన్ని పొందుతున్నాడు. శనివారం రాత్రి తూర్పు అటవీప్రాంతంలోని చింతలవంక నుంచి 16 ఏనుగుల గుంపు ఈ మామిడితోటలోకి ప్రవేశించి సుమారు 50 కొబ్బరిచెట్లను విరిచేసి, కొబ్బరిచెట్లను, విద్యుత్ స్తంభాన్నీ నేలకూల్చాయి. ఆరు మామిడి, మూడు జామ, మూడు మునగ చెట్లు, నీటిపైపులను ధ్వంసం చేశాయి. ఇదే గ్రామంలోని రైతు కృష్ణయ్యకు చెందిన 26 కొబ్బరి, ఏడు మామిడిచెట్లతోపాటు అల్లనేరేడు చెట్టును ఏనుగులు విరిచేశాయి. అనంతరం వచ్చిన మార్గంలోనే అడవిలోకి తిరుగుముఖం పట్టాయి. ఏనుగుల గుంపు నేలమట్టం చేసిన కొబ్బరిచెట్లను ఆదివారం ఉదయం చూసిన రైతులు వాపోయారు. ధ్వంసమైన పంటలను ఎఫ్‌బీవో మున్నా పరిశీలించారు.



ధ్వంసమైన అల్లనేరేడు చెట్టు



కూలదోసిన విద్యుత్ స్తంభం

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలి



రేవంత్(ఫైల్ ఫొటో)

చిత్తూరు అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్‌కు ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు నగరంలోని కలెక్టరేట్ వెనుకభాగంలో ఉన్న సుజీవననగర్‌లో ఉంటున్న హరినాథనాయుడు కుమారుడు రేవంత్ బీటెక్ పూర్తిచేసి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. నెలకు రూ.లక్ష వరకు జీతం తీసుకుంటున్నాడు. ఖాళీ సమయాల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడటం మొదలు పెట్టాడు. తొలి రోజుల్లో కొంత ఆదాయం రావడంతో బెట్టింగ్ ఓ వ్యసనంగా మారిపోయింది. పెద్ద మొత్తాలను బెట్టింగ్‌లో పెట్టడం మొదలుపెట్టాడు. ఆ తర్వాత సుమారు రూ.40 లక్షల వరకు అప్పులు చేసి.. బెట్టింగ్‌లో పెట్టి పోగొట్టుకున్నాడు. అప్పులిచ్చిన వారు ఒత్తిడి తేవడంతో భరించలేక ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందాడు. తల్లిదండ్రుల సమాచారంతో రెండో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి.. కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

వయనాడ్ ఎన్నికల బరిలో తిరుపతి జిల్లావాసి



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న డాక్టరు నాగేశ్వర రావు

ఇంతకాలం ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రాతినిధ్యం వహించిన కేరళ రాష్ట్రం వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండకు చెందిన డాకర్ దుగ్గిరాల నాగేశ్వర రావు పోటీ చేస్తున్నారు.రాహుల్‌గాంధీ రాజీనామా నేపథ్యంలో ఆయన సోదరి ప్రియాంకగాంధీ ఇక్కడ కాంగ్రెస్ తరపున బరిలో వున్న విషయం తెలిసిందే.ఇక్కడ పోటీ చేస్తున్న 16 మంది అభ్యర్థుల్లో ఇండిపెండెంట్ అభ్యర్థి ఆర్. రాజన్ తప్ప మిగతా వారంతా స్థానికేతరులు కావడం విశేషం. పోటీ చేస్తున్న ఇద్దరు తెలుగు వారిలో ఒకరైన డాక్టర్ నాగేశ్వరరావు ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఈయన జాతీయ జనసేన పార్టీ తరపున పోటీ చేస్తున్నారు.

- ఎర్రావారిపాలెం, ఆంధ్రజ్యోతి

కలెక్టరేట్‌లో నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. నియోజకవర్గ, మండల స్థాయిల్లో జరిగే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయా అధికారులంతా హాజరుకావాలని ఆదేశించారు.

పోలీసు కార్యాలయంలోనూ..

జిల్లా పోలీసు(పాత) కార్యాలయంలో సోమవారం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే అర్జీదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రూ.12.84 కోట్లతో రోడ్లు, శ్మశాన వాటికల అభివృద్ధి

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామీణ రహదారులపై ఏర్పడ్డ గుంతల్లో తట్ట మట్టి కూడా పోయలేదు. దీని వల్ల ప్రజలు వర్షాల సమయంలోనే కాదు.. సాధారణ రోజుల్లోనూ గుంతలతో నిండిన రహదారుల్లో ప్రయాణించాలంటే నానా ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పల్లెపండుగ పేరుతో గ్రామాల్లో ప్రజలకనీస అవసరాలైన రోడ్ల నిర్మాణాలు, శ్మశాన వాటికల అభివృద్ధి, అంగన్వాడీ భవనాలకు ప్రహరీల నిర్మాణం వంటి పనులకు నిధులు మంజూరు చేయడంతోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులను సమన్వయం చేస్తూ గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ఏడు నియోజకవర్గాల పరిధిలో సీసీరోడ్ల నిర్మాణాలు, శ్మశానవాటికల అభివృద్ధి వంటి 248 పనులను రూ.12.84కోట్లతో పూర్తిచేశారు. ఈ ఏడాది జిల్లా యంత్రాంగం 1,503 పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించింది. శరవేగంగా జరుగుతున్న పనులను ఎప్పటికప్పుడు పంచాయతీరాజ్ ఇంజనీర్లు తనిఖీలు చేస్తున్నారు.

నియోజకవర్గం	పూర్తి చేసిన పనులు	నిధులు
చిత్తూరు	06	రూ.21 లక్షలు
గంగాధరనెల్లూరు	54	రూ. 2.50 కోట్లు
పలమనేరు	62	రూ. 2.88 కోట్లు
పూతలపట్టు	27	రూ. కోటి
కుప్పం	62	రూ.4.20 కోట్లు
నగరి	09	రూ.కోటి
పుంగనూరు	28	రూ.91.50 లక్షలు

వరసిద్ధుడి దర్శనానికి 3 గంటలు



- భక్తులతో కిక్కిరిసిన కాణిపాకం

ఐరాల(కాణిపాకం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు కావడంతో స్వామి దర్శనార్థం వేలాదిగా భక్తులు వరసిద్ధుడి ఆలయానికి విచ్చేయడంతో క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. స్వామి దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో భక్తులు ఇబ్బందులు పడకుండా అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు.

రేపటినుంచి పవిత్రోత్సవాలు

వరసిద్ధుడి ఆలయంలో మంగళవారం నుంచి గురువారం వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో గురుప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉభయదారులు, భక్తులు, పరిసర గ్రామస్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని ఈవో కోరారు. కాగా, స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాక ఆలయంలో పవిత్రోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ.



రష్యన్ల రాహుకేతు పూజలు

జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం సుమారు 40మంది రష్యా దేశస్తులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆలయంలో శిల్పకళ అద్భుతంగా ఉందని తెలిపారు. తాము స్వామి అమ్మవార్లను దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సారె ట్రయల్ రన్

తిరుచానూరులో ఈనెల 28 నుంచి నిర్వహించనున్న ని పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆదివారం శ్రీవారి సారె ట్రయల్ రన్ నిర్వహించారు. ఉత్సవాల్లో చివరి రోజు (వచ్చే నెల 6న) పంచమీతీర్థం సందర్భంగా అమ్మవారికి తిరుమల నుంచి శ్రీవారు సారె పంపడం ఆనవాయితీ. ఈ క్రమంలో ట్రయల్ రన్‌గా ఆదివారం ఉదయం డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏవీఎస్వో సతీష్‌కుమార్, తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్, ఇతర టీటీడీ అధికారులు, సిబ్బంది కలిసి ఏనుగులపై అమ్మవారి నమూనా సారె తెచ్చారు. కోమలమ్మ సత్రం నుంచి రాములవారి గుడి, గాంధీరోడ్డు మీదుగా గోవిందరాజ స్వామి ఆలయం, గ్రూప్‌థియేటర్స్, ఆర్టీసీ బస్టాండు, పూర్ణకుంభం సర్కిల్, లక్ష్మీపురం, పద్మావతిపురం మీదుగా తిరుచానూరు ఆలయం వరకు తీసుకువచ్చారు. సూపరింటెండెంట్లు రమేష్, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి





ఆహ్లాదంగా పర్యాటకులు



సీమ సిగలో మరో బీచ్

శ్రీనివాససత్రం

అభివృద్ధి పరిస్తే గొప్ప పర్యాటక క్షేత్రం అవుతుంది



చెన్నై నుంచి కృష్ణపట్నంపోర్టుకు వెళ్తున్న స్టీమర్

జిల్లాల విభజనతో రాయలసీమకు సముద్రం కానుకగా వచ్చింది. ఆహ్లాదకరమైన పర్యాటక ప్రదేశంగా కోట సమీపంలోని తూపిలిపాళెం బీచ్ గుర్తింపు పొందింది. పెద్దగా వసతులు లేకపోయినా పర్యాటకులు పెద్ద సంఖ్యలో వెళ్తుంటారు. అయితే రాష్ట్ర పర్యాటక శాఖ కన్ను పడని మరొక అందమైన బీచ్ కూడా కోట మండలంలో ఉంది. మంచి రోడ్డు వేసి, వసతులు కల్పిస్తే ఈ రెండు బీచ్‌లూ ఆదాయవనరులుగా మారుతాయి.

- కోట, ఆంధ్రజ్యోతి

ఎండకి మెరిసే ఇసుక మీదకి ఉరకలెత్తే అలలు.. సముద్రంలో సాగిపోయే పడవలు.. దూరంగా మసక దృశ్యంలా కృష్ణపట్నం ఓడరేవు.. పోర్టు దిశగా వెళ్లే స్టీమర్లు.. తీరంలో సవకతోపుల్లో చెట్ల కింద సేదదీరే పడవలు.. జీడిమామిడి చెట్లు.. మాల్దీవుల వర్ణన కాదు ఇది. మన తిరుపతి జిల్లాలో ప్రసిద్ధికెక్కని ఒక బీచ్ అందాలు ఇవి. కోట మండలంలోని కొత్తపట్నం పంచాయతీలోని శ్రీనివాససత్రం సముద్రతీరం సౌందర్యం వర్ణనాతీతం. పర్యాటక ప్రదేశంగా దీనిని గుర్తించి అభివృద్ధి పరచలేదు కానీ, సమీప ప్రాంతాల ప్రజలు సెలవు రోజుల్లో వచ్చి ఆహ్లాదంగా గడుపుతుంటారు. లోతు తక్కువగా ఉండడంతో అలలతో సయ్యాటలాడుతుంటారు. నీలపు రంగు పులుముకున్న సముద్రమూ, ఆకాశమూ నేపథ్యంగా ఫోటో షూట్‌లు చేసుకుంటూ ఉంటారు. ఇప్పటిదాకా ఒక్క అవాంఛనీయ సంఘటన కూడా ఇక్కడ జరగలేదంటే ఇదెంత ప్రమాదరహితమైన ప్రదేశమో అర్థం చేసుకోవచ్చు. అభివృద్ధి పరిస్తే అద్భుతమైన పర్యాటక కేంద్రంగా శ్రీనివాస సత్రం బీచ్ రూపు మారుతుంది.

శ్రీనివాససత్రానికి ఇలా వెళ్లొచ్చు..

గూడూరు నుంచి కోట మీదుగా వెళ్లాలి. గూడూరు నుంచి కోటకు 26 కిలోమీటర్లు. అక్కడి నుంచి 20 కిలోమీటర్ల దూరంలో శ్రీనివాససత్రం ఉంటుంది. ఇక్కడిదాకా తారు రోడ్డు ఉంది. ఇక్కడి నుంచీ 500 మీటర్ల దూరంలో సముద్ర తీరం ఉంటుంది. సొంత వాహనాల్లో గానీ, కోట నుంచి ఆటోల్లోగానీ వెళ్లాలి. శ్రీనివాససత్రంలో టిఫిన్, భోజనం వంటివి లభించవు. ఇక్కడికి 5 కిలోమీటర్ల దూరంలోని గోవిందపల్లిలో మాత్రం హోటళ్లు ఉంటాయి.



శ్రీనివాససత్రం నుంచి కనిపిస్తున్న కృష్ణపట్నం పోర్టు

సముద్రంలో రెండు దీవులు

2022లో కేంద్ర పర్యాటక శాఖ బృందం ఈ బీచ్‌ను పరిశీలించింది. అభివృద్ధి పరచడానికి ఉన్న అవకాశాలను అధ్యయనం చేసింది. గొవిందపల్లిపాళె-శ్రీనివాససత్రం మధ్య ప్రాంతంలో తీరానికి రెండు కిలోమీటర్ల దూరంలో సముద్రంలో రెండు దీవులు ఉండడాన్ని గుర్తించింది. దిబ్బల్లా ఉన్న వీటిలో చెట్లు కూడా ఉన్నాయి. వీటిని అభివృద్ధి పరిస్తే పర్యాటకుల రాకపోకలు పెరిగే అవకాశం ఉంటుంది. అలాగే తీరం వెంబడి చిన్న చిన్న పిక్‌నిక్ పాయింట్‌లు ఏర్పాటు చేయచ్చని భావించింది. అయితే ఆ నివేదిక అతీగతీ ఏమైందో మాత్రం తెలియదు.

క్రైం కార్నర్ CRIME CORNER

22కిలోల గంజాయి స్వాధీనం

- ఆరుగురు నిందితుల అరెస్ట్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సుబ్బరామిరెడ్డి

చంద్రగిరి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో 22 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. సీఐ సుబ్బరామిరెడ్డి కథనం మేరకు ముందస్తు సమాచారంతో ఎం.కొంగరవారిపల్లి సమీపంలోని జగనన్న కాలనీలో పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన సామిరెడ్డి బేబీ పరిసరాల్లో యానాదుల నుంచి గంజాయి సేకరించి తిరుపతిలో విక్రయించేది. తిరుపతికి చెందిన రమ్య ఇందుకు సహకరించేది. ఈక్రమంలో సామిరెడ్డి బేబీ విశాఖ నుంచి గంజాయి తీసుకువచ్చాడు. దానిని కొనుగోలు చేసేందుకు తిరుచానూరుకు చెందిన నరసింహ, కార్తీక్, ప్రవీణ్, మణికంఠ, అబ్దుల్ కయాం జుబేర్(ఉత్తరప్రదేశ్)లు ఎం.కొంగువారిపల్లి దగ్గర జగనన్న కాలనీకి వచ్చారు. అదే సమయంలో రెవెన్యూ అధికారుల సహకారంలో పోలీసులు, దాడులు చేశారు. ఆరుగురిని అరెస్టు చేశారు. రమ్య పరారైయింది. గంజాయితోపాటు బైక్, కొంతనగదు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ రూ.3.82 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితులను కోర్టుకు తరలించారు. మీడియా సమావేశంలో ఎస్ఐ అనిత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మయ్యది సుపారీ హత్య: డీఎస్పీ

- పది మంది నిందితుల అరెస్టు



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

వెంకటగిరి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి మండలం జయంపు గ్రామంలో ఈ నెల 5వ తేదీ జరిగిన అల్లం లక్ష్మయ్య హత్య కేసును పోలీసులు చేదించారు. లక్ష్మయ్యను ప్రత్యర్థులు సుపారీ ఇచ్చి హత్య చేయించినట్లు డీఎస్పీ రమణ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో హత్యకు దారితీసిన వివరాలను వెల్లడించారు. జయంపు గ్రామానికి చెందిన అల్లం లక్ష్మయ్యకు అదే గ్రామానికి చెందిన శివారెడ్డి కల్యాణ రెడ్డి కుటుంబాల మధ్య పాత కక్షలు ఉండేవి. ఈ నెల 2వ తేదీన రెండు కుటుంబాల మధ్య వివాదం చోటుచేసుకొంది. ఇరువర్గాలకు గాయలవడంతో బాలాయపల్లి పోలీసు స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకొన్నారు. ఈ నేపథ్యంలో లక్ష్మయ్యను హత మార్చాలని కల్యాణ రెడ్డి పథకం రచించారు. వ్యాపారం చేసుకొంటూ తిరుపతిలో వున్న కల్యాణ రెడ్డి అన్నడే కొందరు మిత్రులను కలిసి లక్ష్మయ్య హత్య చేసేందుకు రూ.లక్ష ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకొన్నాడు. ఈనెల 5వ తేదీన తిరుపతి నుంచి టెంపోలో 10మంది జయంపు గ్రామానికి చేరుకొన్నారు. లక్ష్మయ్య ఇంటికి వెళ్లి తాము పోలీసులు అని చెప్పారు. విచారణ కోసం రావాలంటూ లక్ష్మయ్యను వ్యాన్‌లోకి ఎక్కించుకొని తీసుకెళ్లారు. ఇదంతా గమనించిన స్థానికులు వెంకటగిరిలో ఉన్న లక్ష్మయ్య అల్లుడికి ఫోన్ చేసి మీ మామను పోలీసు యూనిఫాంలో వచ్చిన కొందరు తీసుకెళ్లారని, అయితే వారు పోలీసులు కాదేమోనని అనుమానం వ్యక్తం చేశారు. దీంతో లక్ష్మయ్య అల్లుడు తన మామని ఎవరో కిడ్నాప్ చేశారని బాలాయపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు 6వ తేదీ తెల్లవారుజామున హస్తకావేరి పంట పొలాల్లో లక్ష్మయ్య రక్తగాయాలతో పడి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ లక్ష్మయ్య మృతి చెందాడు. హంతకులు తాము వచ్చిన టెంపోను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. ఆదివారం వెంకటగిరి రైల్వేస్టేషన్‌లో గూడూరు వెళ్లే ట్రైన్ కోసం నిరీక్షిస్తున్న 10 మంది అనుమానాస్పదంగా తిరుగుతున్నారని సమాచారం అందడంతో పోలీసులు వెళ్లి వారిని అదుపులోకి తీసుకుని విచారించగా లక్ష్మయ్య హత్య విషయం బయట పడింది. నిందితులందరినీ అరెస్టు చేశారు. కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ తెలిపారు. హత్య కేసును చేదించిన వెంకటగిరి సీఐ రమణ, బాలాయపల్లి ఎస్ఐ గోపిని అభినందించారు.



మృతి చెందిన లోకనాథం

అప్పుల బాధ తాళలేక..

బుచ్చినాయుడుకండ్రిగ, నంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంట సాగుకు అప్పుచేసి పెట్టుబడి పెట్టారు. ఈసారైనా ఆదాయం రాకపోతుందా అని సోదరుడి పొలంతో సహా ఐదు ఎకరాల్లో సేద్యం చేస్తూనే వచ్చారు. ఏటా పెరిగిన వడ్డీతో అప్పు రూ.13 లక్షలకు చేరుకుంది. ఆర్థిక ఇబ్బందులు తాళలేక శనివారం రాత్రి బుచ్చినాయుడు కండ్రిగ మండలం వెస్టవరత్తూరుకు చెందిన రైతు లోకనాథం పురుగుల మందు తాగారు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ విశ్వనాథ నాయుడు కేసు నమోదు చేశారు.



కుటుంబ సభ్యులతో భానుప్రకాష్‌రెడ్డికి ఘన సన్మానం

టీటీడీ సభ్యుడు భానుకు ఘన సన్మానం

- కృషికి తగిన పదవి అన్న వక్తలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల సభ్యుడు జి.భానుప్రకాష్‌రెడ్డికి ఆయన మిత్రబృందం ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతిలోని మహతిలో సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆయన కృషికి తగిన గుర్తింపే.. ఈ పదవి అని పలువురు పేర్కొన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు ఎవరూ టీటీడీ పరిపాలనలో జోక్యం చేసుకోవద్దని సీఎం చంద్రబాబు టీడీఎల్పీ సమావేశంలో ఆదేశించిన మేరకే తాము ఉంటున్నామన్నారు. అయితే, పద్మావతి అమ్మవారు, శ్రీవారి మెట్టు, శ్రీనివాసమంగాపురం, చంద్రగిరి కోట తదితర ప్రాంతాలతోపాటు నియోజకవర్గంలో అభివృద్ధికి టీటీడీ సభ్యుడిగా భానుప్రకాష్‌రెడ్డి సహకరించాలని కోరారు. టీటీడీ సభ్యుడిగా భానుప్రకాష్‌రెడ్డి రెండోసారి నియమితులు కావడం ఆయన శ్రమకు భగవంతుడు ఇచ్చిన ప్రతిఫలమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళి అన్నారు. కలియుగ దైవం శ్రీవారి ఆలయాన్ని ఎవరూ పరిపాలించలేరని.. అందుకే టీటీడీ పాలకమండలిని ధర్మకర్తల మండలిగా వ్యవహరించాలని మాజీ జేఈవో శ్రీనివాసరాజు సూచించారు. తిరుపతిలోని టీటీడీ విద్య వైద్య సంస్థల్లో స్థానికులకు ఉచిత విద్య, వైద్యం అందించేలా భానుప్రకాష్‌రెడ్డి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ కోరారు. టీటీడీపట్ల చిన్న అపచారం, దుష్ప్రచారం జరిగినా పార్టీలకు అతీతంగా ఏకం కావాలని తుడా మాజీ ఛైర్మన్ ఎన్వీ ప్రసాద్ పిలుపునిచ్చారు. తిరుమల స్థానికులు ఎంతో త్యాగం చేశారని, వారికి న్యాయం చేసేందుకు భానుప్రకాష్‌రెడ్డి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. శ్రీవారి అనుగ్రహం, తన తల్లిదండ్రులు, కుటుంబం చేసుకున్న పుణ్యఫలంతోనే తాను రెండోసారి సభ్యుడిని కాగలిగానంటూ భానుప్రకాష్‌రెడ్డి భావోద్వేగం చెందారు. ఇది హోదా కాదు.. బాధ్యతన్నారు. శ్రీవారిపట్ల, సనాతన ధర్మం పట్ల ఎటువంటి అపచారం జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. మొదటి సమావేశంలోనే పాలక మండలి స్థానంలో ధర్మకర్తల మండలిగా వ్యవహరించాలని ప్రతిపాదిస్తానన్నారు. స్విమ్స్‌ను మరింతగా అభివృద్ధి చేయడమే తన తొలి ప్రాధాన్యంగా చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అన్ని అపశ్రుతులను సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, ఆ క్రమంలోనే తానూ శ్రీవారికి, భక్తులకు సేవ చేస్తానని చెప్పారు. తనను సభ్యుడిగా నియమించిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, జనసేనాని పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, తన పార్టీ అధినాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ మాజీ సభ్యుడు అనంత్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్‌రాజు, బీజేపీ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి, సామంచి శ్రీనివాస్, కోలా ఆనంద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, పొన్నగంటి భాస్కర్, జీవన్‌రాయల్, క్రెడాయ్ అధ్యక్షుడు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వేదికపై మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

ముద్దుగారే యశోద

శిల్పారామంలో అలరించిన నృత్యప్రదర్శన



తిరుచానూరురోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సెలవులో భాగంగా ఆదివారం చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యరూపకం అలరించింది. శివగౌరి నృత్యాలయం కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు. భావిష, ఆశ్రిత, కీర్తన, ధామిని, షన్విక, హనన్య, శ్రీనిధి, సహస్ర, ప్రియ, రోషిణి తదితరులు నాగేంద్ర హరాయ, సౌభాగ్య లక్ష్మి, వక్రతుండ మహాకాయ, మహాగణపతిం, ముద్దుగారే యశోద, బ్రహ్మమొక్కటే, శ్రీమన్నారాయణ వంటి కీర్తనలకు నృత్యం చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3.79 కోట్లు

తిరుమల, నవంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.79 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈ ఆదాయ వివరాలను టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 73,558 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 32,675 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.



ఆర్మీలో ఎంపిక కోసం పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు

గెలుపే లక్ష్యంగా పరుగెత్తాలి

- యువతకు పిలుపునిచ్చిన జేసీ అదితిసింగ్
- కడపలో అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

కడప స్పోర్ట్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి హాజరైన అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ఆత్మవిశ్వాసంతో పరుగెత్తాలని జేసీ అదితిసింగ్ పిలుపునిచ్చారు. కడపలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ (డీఎస్ఏ) స్టేడియంలో ఆదివారం వేకువజామున 3 గంటలకు ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఎంపికలు రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నన్ పునీత్ అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి.. ఫిజికల్ టెస్ట్‌కు 13 జిల్లాల నుంచి అభ్యర్థులు పాల్గొననున్నారు. మొదటి దశ పరుగును జేసీ అదితిసింగ్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రతిఒక్కరూ విజయకాంక్షతో ముందడుగు వేయాలన్నారు. ఈ ఎంపికలో విజయం సాధించి దేశానికి భద్రతనిచ్చే గొప్ప యువశక్తిగా నిలవాలని ఆకాంక్షించారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ ర్యాలీకి కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, నంద్యాల,అనంతపురం, సత్యసాయి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి 4000మంది అభ్యర్థులు హాజరు కానున్నారు.వీరిలో రోజుకు 800 మంది చొప్పున అభ్యర్థులకు ఐదురోజులపాటు ఎంపిక పరీక్షలు నిర్వహిస్తారు. అభ్యర్థులు ఎవరు ఏరోజు రావాలనేది ఆర్మీ అధికారులు ముందుగానే కాల్ లెటర్లు పంపించారు.





ఆర్మీ ఎంపిక కోసం వివిధ సామర్థ్య పరీక్షలు

భౌ.. భౌ.. బాబోయ్!

● నగరవాసులను భయపెడుతున్న శునకాలు
● కుక్కకాటుతో ఆస్పత్రి పాలవుతున్న జనం



మిట్టూరులోని కిడోస్ స్కూల్ సమీపంలోని వీధిలో సంచరిస్తున్న శునకాలు



వెంగళరావు కాలనీలో వీధి కుక్కల దాడిలో గాయపడిన వృద్ధురాలు(ఇన్‌సెట్లో) కాలిపై రక్తగాయం



● వారం కిందట మిట్టూరులోని రెడ్‌క్రాస్ వీధిలోని కిడోస్ ప్రీప్రైమరీ స్కూల్ సమీపంలో ఓ పోలీసు అధికారి డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్తుంటే సుమారు ఐదు వీధి కుక్కలు ఆయనపై దాడి చేశాయి. చుట్టుపక్కల వారు వచ్చి కేకలు వేయడంతో వదిలిపెట్టాయి. చిన్న గాయాలతో బయట పడ్డారు. స్కూల్ చుట్టుపక్కలే 15 నుంచి 20 కుక్కలు ఉండటంతో ఎప్పుడేమి జరుగుతుందోనని పిల్లల తల్లిదండ్రులు భయపడుతున్నారు.

● గత నెల 28వ తేదీన నగరంలోని వెంగళరావు కాలనీకి చెందిన 70 ఏళ్ల వృద్ధురాలు ఇంటి వద్ద ఉండగా వీధి కుక్క ఒకటి ఆమెను తీవ్రంగా కరిచింది. చుట్టుపక్కల వారొచ్చి ఆ కుక్కను కర్రలతో తరిమికొట్టాల్సి వచ్చింది. కొద్దిసేపు ఎవరూ రాకుంటే ఆమె ప్రాణాలు పోయిండేవని కుటుంబీకులు తెలిపారు. పెద్దగాయం కావడంతో వృద్ధురాలు ఇప్పటికీ కోలుకోలేదు.

● ఫిబ్రవరి 11వ తేదీన ఒక్క రోజే నగరంలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కల దాడికి 89 మంది గాయపడ్డారు. జెండామాను వీధి, తోటపాళ్యం, సంతపేట, ఇంద్రానగర్, కోర్టు జంక్షన్, ఎంఎస్ఆర్ సర్కిల్, కట్టమంచి, బజారు వీధిల్లో వాహనదారులు, స్థానికులపై దాడి చేశాయి. ఇందులో 60 మందిపై ఒకే కుక్క దాడి చేయగా.. మిగిలిన వారిని ఆయా వీధుల్లో ఉన్న కుక్కలు కరిచినట్లు స్థానికులు తెలిపారు. వీరంతా చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స తీసుకున్నారు.

...చిత్తూరు నగరంలో వీధి కుక్కల స్వైరవిహారానికి ఉదాహరణలు ఇవి. రాత్రీపగలు తేడా లేకుండా కరుస్తుండటంతో ఆస్పత్రి పాలవుతున్నవారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ప్రతి వీధికి 10 నుంచి 20 చొప్పున ఉంటూ స్థానికులను భయపెడుతున్నాయి. కార్పొరేషన్ లెక్కల ప్రకారమే నగరంలో ఐదువేల వీధి కుక్కలు ఉన్నట్లు సమాచారం. అనధికారిక లెక్క ప్రకారం సుమారు 20వేల కంటే ఎక్కువ ఉన్నట్లు స్వచ్ఛంద సంస్థల సర్వేలు చెబుతున్నారు.

● రోజుకు పదుల సంఖ్యలో కేసుల నమోదు

ప్రతి రోజూ నగరంలోని యూపీహెచ్‌సీల్లో, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో పదుల సంఖ్యలో కుక్క కాటు కేసులు నమోదు అవుతున్నాయి.

● అధికారులు పట్టించుకోవడం లేదంటున్న జనం

వీధి కుక్కల బెడదపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా నగరపాలక అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఏదైనా సంఘటన జరిగితే మాత్రం రెండ్రోజులు హడావుడి చేస్తున్నారన్నారు. ఓ పది ఇరవై కుక్కలను పట్టుకుని వెళ్లిపోతారని వాపోతున్నారు.

పక్కవీధిలో వదిలేస్తున్నారా?

ఒక వీధిలో పట్టుకున్న కుక్కలను వేరే వీధిలో వదిలి పెడుతున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. కొందరు వీధి కుక్కలకు ఆహారం పెడుతుండటం కూడా వీటి సంతతి పెరగడానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఈ కుక్కల బెడదను తప్పించాలని కోరుతున్నారు.

- చిత్తూరు రూరల్, ఆంధ్రజ్యోతి



రంగారెడ్డి వీధిలో కుక్కలకు ఆహారం పెడుతున్న మహిళ

2,200 లీటర్ల సారా ఊట ధ్వంసం



తంబుగానిపల్లె, నక్కలాంపల్లె అటవీ ప్రాంతాల్లో సారా ఊటను ధ్వంసం చేసిన పోలీసులు

బంగారుపాళ్యం/, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సారా తయారీ కేంద్రాలపై ఆదివారం పోలీసులు దాడులు చేసి 2,200 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. బంగారుపాళ్యం మండలంలోని తంబుగానిపల్లె అటవీ ప్రాంతంలో సారా తయారు చేస్తున్నారనే సమాచారంతో దాడులు పోలీసులు చేశారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 200 లీటర్ల ఊటను, సామగ్రిని ధ్వంసం చేసినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. ● వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం పంచాయతీ నక్కలాంపల్లె గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో దాడులు చేసి, రెండు వేల లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. అలాగే 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది గంగయ్య, కళ్యాణ్, గణేష్ పాల్గొన్నారు.

26న కలెక్టరేట్ ఎదుట రైతు, కార్మిక సంఘాల ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘ నేత కాటమయ్య

చిత్తూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా రైతు, కార్మిక విధానాలపై నిరంకుశ వైఖరిని ప్రదర్శిస్తున్న మోదీ ప్రభుత్వానికి కళ్లు తెరిపించేందుకు ఈ నెల 26న పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నట్లు రైతు సంఘ నాయకుడు కాటమయ్య తెలిపారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో రైతు, కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో మోదీకి సీట్లు తగ్గించి తగిన బుద్ధి చెప్పినా ఆయన విధానాల్లో మార్పు రాలేదన్నారు. ఇందుకు నిరసనగా ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు జనార్థన్, నాగరాజు, సరేంద్ర, ఓబులు, రాజు, విజయగౌరీ, సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ విజేత చిత్తూరు జట్టు



నగరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ తరపున రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 బాలుర బ్యాడ్మింటన్ పోటీలలో చిత్తూరు జిల్లా జట్టు గెలుపొందినట్లు కోచ్ గోపీ తెలిపారు. జట్టులోని క్రీడాకారులైన కేసీ తేజేష్, ఇక్బాజ్ అహ్మద్, భానుప్రకాష్, రక్షణ్, సిద్దిక్, జశ్వంత్, అభినేష్, నేత్రసాయి, మోహిత్‌కుమార్, వెంకట్‌లను ఎస్‌జీఎఫ్ సిబ్బంది అభినందించారు.

జాతీయ జట్టుకు ముగ్గురి ఎంపిక

ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు నుంచి నగరి పట్టణానికి చెందిన కేసీ తేజేష్, ఇక్బాజ్ అహ్మద్, శ్రీకాళహస్తి నుంచి ఎం.వెంకట్ అనే క్రీడాకారులు జాతీయ జట్టుకు ఎంపికయ్యారు.

రూ.99 క్వార్టర్ బాటిల్ కావాలా.. గంటలోపే రావాలి నాయనా..?

శ్రీరంగరాజపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):క్వార్టర్ మద్యంబాటిల్ ధర రూ.99కి విక్రయిస్తున్న విషయం తెలిసిందే. ఈ బాటిల్‌కోసం ఎస్ఆర్‌పురం మండలం 49.కొత్తపల్లెమిట్టలో దేవివైన్స్ షాపునకు ఎప్పుడు వెళ్లినా స్టాకు లేదంటున్నారని మందుబాబులు ఆరోపిస్తున్నారు. షాపు తెరిచిన గంటలోపు వస్తేనే ఉంటుందని నిర్వాహకులు చెబుతున్నట్లు వాపోతున్నారు. దీనిపై ఎక్సైజ్‌శాఖ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ



ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ, దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

చౌడేపల్లె, నవంబర్10:(ఆంధ్రజ్యోతి) ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ భక్తుల అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. ఉదయం అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, అమ్మవారికి ప్రీతికరమైన వేపాకు తోరణాలతో ఆలయాన్ని అలంకరించారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు అర్చనలు చేసి, స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కార్యవర్గం



జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా శాఖ ఎన్నికలు ఆదివారం స్థానిక రెవెన్యూ భవన్‌లో ఏకగ్రీవంగా జరిగాయి. జిల్లా అధ్యక్షుడిగా సదుం తహసీల్దార్ ఎస్‌ఏ హుస్సేన్, అసోసియేటెడ్ అధ్యక్షుడిగా యాదమరి తహసీల్దార్ పార్థసారధి, వైస్ ప్రెసిడెంట్లుగా సోమల ఆర్‌ఎస్‌డీటీ ఇబ్రహీం, చిత్తూరు కలెక్టరేట్ డీటీ వీఎం సరిత, రామకుప్పం హెచ్‌డీటీ అశోక్ ఎంపికయ్యారు. కోశాధికారిగా రామకుప్పం ఆర్‌ఎస్‌డీటీ కె.పన్నీర్‌శెల్వం, ప్రధానకార్యదర్శిగా తవణంపల్లె తహసీల్దార్ ఎస్.సుధాకర్, జాయింట్ సెక్రటరీలుగా శాంతిపురం ఆర్‌ఎస్‌డీటీ చంద్రశేఖర్, పులిచెర్ల హెచ్‌డీటీ పి.కిరణ్‌కుమార్, చిత్తూరు తహసీల్దార్ ఆఫీసు సబార్డినేట్ జీవరత్నం, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా కె.వంశీకృష్ణ (చిత్తూరు రూరల్), ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్ఆర్ పురం సీనియర్ అసిస్టెంట్ గోపీనాథన్, ఈసీ మెంబర్లుగా జె.ప్రవీణ్‌కుమార్ (పాలసముద్రం), మహేశ్వరి (చిత్తూరు), మధుసూదన్ (బంగారుపాళ్యం), ఫణికుమార్ (పుంగనూరు) ఎన్నికయ్యారు. గతంలో జిల్లా అధ్యక్షుడిగా కొనసాగిన అమర్‌నాథ్‌తోపాటు పాలకవర్గ సభ్యులు పునర్విభజన అనంతరం అన్నమయ్య, తిరుపతి జిల్లాలకు బదిలీపై వెళ్లిపోవడంతో పాలకవర్గ ఎన్నికలు జరిగాయని నూతన అధ్యక్షుడు హుస్సేన్ తెలిపారు.

పట్టర పట్టు..!

యాదమరిలో హోరాహోరీగా కుస్తీ పోటీలు



తలపడుతున్న విశాఖ, చిత్తూరు బాలికలు (ఇన్‌సెట్లో) చిత్తూరు, నెల్లూరు బాలురు

యాదమరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): యాదమరిలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-17 బాలబాలికల కుస్తీ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. ఆదివారంతో సెమీఫైనల్స్ పోటీలు ముగిశాయి. సోమవారం తుది పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం సెలవు కావడంతో క్రీడాకారులను స్థానిక యువత ఉత్సాహపరుస్తూ సందడి చేశారు.

బాలుర విభాగంలో..

శ్రీకాకుళం క్రీడాకారులు నాలుగు కేటగిరీల్లో విజేతలుగా నిలిచారు. అలాగే చిత్తూరు మూడు, పశ్చిమ గోదావరి, విజయనగరం, అనంతపురం, నెల్లూరు, విశాఖ, కడప, గుంటూరు, ప్రకాశం క్రీడాకారులు ఒక్కో కేటగిరీలో విజయం సాధించారు.

బాలికల విభాగంలో..

గుంటూరు క్రీడాకారులు నాలుగు కేటగిరీల్లో విజేతలుగా నిలిచాయి. అలాగే విశాఖ, చిత్తూరు, నెల్లూరు, అనంతపురం, తూర్పుగోదావరి రెండు చొప్పున, పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం, కృష్ణ ఒక్కో విభాగంలో విజయం సాధించారు.

అహం వీడితేనే మనిషికి ఎదుగుదల

● గరికపాటి నరసింహారావు



చిత్తూరు కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'అహం వీడితేనే మనిషికి ఎదుగుదల సాధ్యమవుతుంది. లేదంటే అవమానం మాత్రం కచ్చితంగా దక్కుతుంది' అని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త గరికపాటి నరసింహారావు అన్నారు. స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో చిత్తూరు నారాయణి సేవా సమితి ఆధ్వర్యంలో యోగవాసిష్ఠంపై గరికపాటి ప్రవచనాల కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. చివరి రోజైన ఆదివారం ఆయన ప్రవచిస్తూ.. పరిపాలకుడు సజ్జనుడైతే రాజ్యం సుభిక్షంగా ఉంటుందన్నారు. అందరి పట్ల సమానత్వాన్ని ప్రదర్శించేవాడే అసలైన పాలకుడని చెప్పారు. చివరలో గరికపాటిని నిర్వాహకులు సత్కరించారు.

టిప్పుసుల్తాన్ జయంతి సందడి



పుంగనూరులో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

పుంగనూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): టిప్పుసుల్తాన్ జయంతి సందర్భంగా పుంగనూరులో ముస్లింలు ఆదివారం సందడి చేశారు. కుమ్మరవీధిలో వాహనానికి టిప్పుసుల్తాన్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి తూర్పుమొగసాల, ఎంబీటీ రోడ్డు, ఇందిరా సర్కిల్, ప్రైవేటుబస్టాండ్, ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కుమ్మరవీధిలో అన్నదానం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. టీడీపీ మైనార్టీ నాయకులు సుహేల్‌బాషా, సద్దాం హుసేన్, నదీమ్, అస్లాం, ఆఫ్రిద్‌మాలిక్, పర్వేజ్, ఇమ్రాన్, ఇఫాన్, తదితరులు పాల్గొన్నారు.

కరెంటు లేకపోవడంతో తప్పిన ప్రమాదం



కారుపై కూలిన విద్యుత్ స్తంభం

నగరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని తడుకుపేట వద్ద జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొంది. విద్యుత్ స్తంభం ఒకటి కారుపై పడింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. చెన్నై నుంచి భక్తులు కారులో తిరుమలకు వెళుతుండగా ఈ ఘటన జరిగింది. ట్రాన్స్‌ఫార్మర్‌ను కారు ఢీకొన్న వెంటనే ఎయిర్‌బెలూన్ తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పినట్లు స్థానికులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు రోడ్డుపై పడటంతో కిలోమీటరు మేర ట్రాఫిక్ స్తంభించింది. అధికారులొచ్చి వాటిని తొలగించి వాహనాల రాకపోకలు పునరుద్ధరించారు.

యూట్యూబ్‌లో చూసి.. దొంగ నోట్లు ముద్రించి

● పుత్తూరులో పట్టుబడిన నిందితులు
● నిందితుల్లో ఒకరు శ్రీకాకుళం జిల్లావాసి
● కారు, వస్తువుల సహా నోట్లు స్వాధీనం



నిందితులను చూపుతున్న పోలీసులు

పుత్తూరు టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'నకిలీ నోట్లు ఎలా ముద్రించాలి?' అనేది యూట్యూబ్‌లో చూశారు. ఆ ప్రకారం వస్తువులు తీసుకొచ్చి ముద్రణ చేపట్టారు. వీటిని చెలామణి చేసే క్రమంలో పట్టుబడ్డారు. నిందితులను తిరుపతి జిల్లా పుత్తూరు పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను పుత్తూరు డీఎస్పీ రవికుమార్ ఆదివారం సాయంత్రం మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన మునికృష్ణారావుకు ఫేస్‌బుక్ ద్వారా తిరుపతిలోని రమేష్‌తో పరిచయం ఏర్పడింది. వీరిద్దరూ కలిసి రమేష్ ఇంట్లో షేర్ మార్కెట్ బిజినెస్ చేసేవారు. ఇందులో నష్టాలు వచ్చాయి. దీంతో డబ్బు సంపాదనకు అడ్డమార్గం ఎన్నుకున్నారు. కరెన్సీ నోట్లను ముద్రించే విధానాన్ని యూట్యూబ్‌లో తెలుసుకున్నారు. దీనికి రమేష్ భార్య సంధ్య, కుమార్తె ఇషా తోడయ్యారు. వీరు నలుగురు తిరుపతిలోనే నోట్ల ముద్రణకు కావాల్సిన వస్తువులను కొని ఇంట్లోనే ముద్రించేవారు. ఆ దొంగ నోట్లతో శ్రీకాళహస్తి, తిరుపతి, రేణిగుంట, పుత్తూరులో వస్తువులను కొనుగోలు చేస్తూ మార్చేవారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం రమేష్, ఇషా పుత్తూరు పట్టణం మండివీధిలోని నిర్మల ప్రొవిజన్ స్టోర్, జగన్నాథం ప్రొవిజన్ స్టోర్, శ్రీకృష్ణ స్టోర్స్, శంకర్ దుకాణాలు వంటి పలు దుకాణాల్లో తమ వద్ద నున్న రూ.500 నోట్లతో పలు వస్తువులను కొనుగోలు చేశారు. వారిచ్చిన నోట్లను ఒక దుకాణాదారుడు కరెన్సీ యంత్రంలో లెక్కించగా అది దొంగనోట్లుగా గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పుత్తూరు సీఐ సురేంద్ర నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది ఆ దుకాణం వద్దకు వెళ్లి సీసీ కెమెరా ద్వారా దొంగనోట్లను ఇచ్చిన వారిని గుర్తించారు. వీరు మరో దుకాణంలో వస్తువులు కొనుగోలు చేస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించారు. తిరుపతి, చెర్లోపల్లె సర్కిల్‌లో ఒక ఇంట్లో నోట్లను ముద్రిస్తున్నట్లు చెప్పడంతో, పోలీసులు ఆ ఇంట్లో సోదాలు నిర్వహించారు. నోట్ల ముద్రణకు కావాల్సి వస్తువులు, ప్రింటర్లు, ల్యామినేషన్ యంత్రం, స్క్రీన్ ప్రింటింగ్, కలర్ లిక్విడ్స్, కట్ చేయడానికి సిద్ధంగా ఉన్న 192 రూ.వంద నోట్ల షీట్లు, 156 రూ.ఐదువందల నోట్ల షీట్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ మీడియా సమావేశంలో ఎస్‌ఐ ఓబులయ్య, పోలీసులు పాల్గొన్నారు.



నకిలీ కరెన్సీకి వాడిన వస్తువులు

అడవి పంది దాడితో ఒకరికి గాయాలు

సోమల : చిన్నఉప్పరపల్లె సమీపంలోని ఇర్లపల్లె వద్ద వేరుశనగ పంటకు కాపుకాస్తున్న వెంకటేశ్‌పై శనివారం రాత్రి అడవి పంది దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. పందులను తరిమే ప్రయత్నంలో అతడిపైకి ఓ పంది తిరగబడింది. సోమల వైద్యశాలలో చికిత్స పొందాడు.

ఓటరు నమోదు పరిశీలన

సోమల : ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ బెన్నురాజ్ తనిఖీ చేశారు. ఆదివారం మండలంలోని పలు నమోదు కేంద్రాలను పరిశీలించి 18ఏళ్లు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించడానికి బీఎల్వోలు చొరవ తీసుకోవాలని, మృతులను తొలగించాలన్నారు.

గంగమ్మ ఆలయంలో టీడీపీ నేత ప్రమాణం



కుప్పం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గత మున్సిపల్ ఎన్నికల్లో అప్పటి వైసీపీ ఛైర్మన్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌తో తాను ఎటువంటి లాలూచీ పడలేదని ఆదివారం టీడీపీ ప్రచార కార్యదర్శి, మాజీ సర్పంచి పి.గోపీనాథ్ పెద్దపల్లి గంగమ్మ సాక్షిగా ప్రమాణం చేశారు. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీనుంచి మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థి డాక్టర్ సుధీర్ 16వ వార్డు నుంచి పోటీలో ఉన్నారు. ఆయనకు ప్రత్యర్థిగా టీడీపీ సీనియర్ నేత పి.గోపీనాథ్ కుమారుడు హర్ష ధర్మతేజ నిలబడి 200ల పైచిలుకు ఓట్లతో ఓటమి పాలయ్యారు. కుమారుడి భవిష్యత్తును సైతం పణంగా పెట్టి, సుధీర్‌తో గోపీనాథ్ లాలూచీ పడడంవల్లే ఇది జరిగిందని సొంత పార్టీ నేతలే ఆయనపై అప్పట్లో తీవ్ర ఆరోపణలు చేశారు. ఇటీవల సుధీర్ తన ఛైర్మన్, కౌన్సిలర్ పదవులకు రాజీనామా చేసిన నేపథ్యంలో ఈ ఆరోపణలు ఇప్పుడు తిరిగి వినిపించడం ప్రారంభించాయి. ఇదే 16వ వార్డునుంచి హర్షధర్మతేజ మళ్లీ పోటీకి ఎక్కడ దిగుతాడోనన్న ఆందోళనవల్లే పార్టీలోని గిట్టనివారు ఈ ఆరోపణలకు మళ్లీ ఊపిరిపోస్తున్నారన్న అనుమానం గోపీనాథ్ వర్గంలో ఎక్కువైంది. ఈ నేపథ్యంలలో ఆయన ఆదివారం నాడు కొత్తపేటలోని పెద్దపల్లి గంగమ్మ గుడి వద్దకు చేరుకున్నారు. అక్కడ కర్పూరం వెలిగించి అమ్మకు మొక్కుకున్నారు. పెద్దపల్లి గంగమ్మ, ప్రసన్న తిరుపతి గంగమ్మల సాక్షిగా తాను ఎటువంటి లాలూచీ పడలేదని ప్రమాణం చేశారు. అలా ఎవరైనా నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తానని సవాల్ విసిరారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పలమనేరు, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉద్యోగులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని, హెచ్ఆర్‌పి పాలసీ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత క ల్పించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ. 25 లక్షలు మంజూరు చేయాలని వారు డిమాండు చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి జ్ఞానశేఖర్, జిల్లా ఛైర్మెన్ బాలసుబ్రమణ్యం, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పలమనేరు డివిజన్ కమిటీని ఎన్నుకొన్నారు. ఛైర్మన్‌గా ప్రశాంత్‌కుమార్‌రాజా, ప్రధాన కార్యదర్శిగా జనార్థన్, వైస్ ఛైర్మన్‌గా హరికృష్ణ, ట్రెజరర్‌గా కిరణ్‌కుమార్, సంయుక్త సెక్రటరీగా ప్రసాద్‌లను ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ అధ్యక్షుడు గంజి రామ్మూర్తి, కోశాధికారి రెడ్డిగోపాల్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై మహిళల నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

పుంగనూరు రూరల్, నవంబరు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ మహిళలు ఖాళీబిందెలతో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. భీమగానిపల్లె పంచాయతీ లక్ష్మీపురం కాలనీలో 15 రోజుల క్రితం బోరు మరమ్మతులకు గురి కావడంతో మోటర్, పైపులు తీసి బయట వేశారని, ఇప్పటి వరకు అధికారులు, ప్రజాప్రతినిధులు కన్నెత్తి చూడలేదన్నారు. కాలనీ నుంచి కిలోమీటర్ దూరం వెళ్లినా తాగునీరు దొరకడం కష్టంగా ఉందన్నారు. అధికారులు స్పందించి బోరుమోటర్ మరమ్మతులు చేపట్టి తాగునీరు సరఫరా చేయాలని కాలనీ మహిళలు కోరుతున్నారు. కాలనీ వాసులు గంగులమ్మ, పద్మావతమ్మ, హసీనా, కరీమునీషా, హాజీరా, మస్తానీ, వసంతమ్మ పాల్గొన్నారు.

హైందవ చైతన్యమే దేశ సంక్షేమం

పుంగనూరు రూరల్, నవంబరు10(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జనవరి 5న నిర్వహించే శంఖారావ సభను విజయవంతం చేయాలని హైందవ సంఘ సభ్యులు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన సమావేశంలో హైందవ శంఖారావం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి సమావేశాలు నిర్వహించి హిందూ సంఘాలను ఏర్పాటు చేయాల్సిన అవసరముందన్నారు. హిందూ ధర్మ రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హైందవ ప్రాంత ప్రచారక్ ప్రభాకర్ కోరారు. కార్యక్రమంలో హిందూ సంఘాల సభ్యులు, హైందవ సంఘ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

షటిల్ కోర్టు వద్ద ఇరువర్గాల వాగ్వాదం

పుంగనూరు, నవంబరు10(ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఇండోర్ షటిల్ కోర్టు వద్ద ఆదివారం కొంత ఉద్రిక్తత నెలకొంది. మూడు నెలల క్రితం రాత్రి ఇండోర్ షటిల్ కోర్టును గుర్తుతెలియని వ్యక్తులు కూల్చిన ఘటన పాఠకులకు విదితమే. అప్పటి నుంచి ఆ స్థలం వైపు ఎవరూ రాకపోవడంతో క్రీడాకారులు, నిర్వాహకులు పోలీసుస్టేషన్, తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఆదివారం పట్టణానికి చెందిన ప్రేమ్‌కుమార్‌తో పాటు మరి కొందరు కలసి ఇండోర్ షటిల్ కోర్టును శుభ్రం చేస్తున్నట్లు తెలుసుకున్న షటిల్ కోర్టు నిర్వాహకులు అక్కడకు చేరుకుని పనులను అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతారణం నెలకొంది. సీఐ శ్రీనివాసులు చేరుకుని పరిస్థితిపై ఆరా తీసి షటిల్ కోర్టుకు సంబంధించిన రికార్డులను తీసుకురావాలని ఇరువర్గాలకు తెలిపారు. అంతటితో ఇరువర్గాల వారు అక్కడ నుంచి వెనుతిరిగారు.

పెన్షనర్ల సమస్యలు తీర్చండి

పలమనేరు, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గురు రాజారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం పలమనేరులో జరిగిన పెన్షనర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్లకు జూలై 2018 నుంచి జూలై 2023 వరకు చెల్లించవలసిన డీఏ, డీఆర్ బకాయిలు, చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 11వ పీఆర్సీ బకాయిలు ఏప్రిల్ 2020 నుంచి డిసెంబరు 2021 చెల్లించలేదని తెలిపారు. 11వ పీఆర్సీలో కోల్పోయిన అడిషనల్ క్వాంటమ్ పునరుద్ధరించాలన్నారు. సంఘ నాయకులు కృష్ణమూర్తి, గౌస్, వీరభద్రగౌడు, బాలసుబ్రమణ్యం, అక్బర్‌భాషా, గురుమూర్తి నాయుడు, మోహన్, స్వామినాధన్, సుబ్రమణ్యంరెడ్డి, జిక్రియా, చక్రపాణిరెడ్డి, మస్తాన్, సులోచన, సరస్వతమ్మ, నాగభూషణమ్మ, మధు, నిజాంసాహెబ్, వినాయకం, సాంబయ్య, రెడ్డెప్ప, సోమశేఖర్ పాల్గొన్నారు.

ముగిసిన ఓటరు నమోదు శిబిరం

చౌడేపల్లె, నవంబర్10 (ఆంధ్రజ్యోతి): ఓటరు నమోదు కోసం రెండు రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమం ఆదివారంతో ముగిసినట్లు తహసీల్దార్ హనుమంత్ పేర్కొన్నారు. ముసాయిదా ఓటరు జాబితా కోసం నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో రెండు రోజులుకుగాను ఫాం-6 కోసం 74, ఫాం-7 కోసం 17, ఫాం-8 కోసం 23 దరఖాస్తులు అందినట్లు తెలిపారు.

పొంచివున్న ప్రమాదం



పెచ్చులూడిన భవనం పైకప్పు

పలమనేరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులోని విద్యుత్ సేవా కేంద్ర సముదాయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఈ భవనాన్ని 1999లో జన్మభూమి కార్యక్రమం కింద నిర్మించారు. ఈ భవనంలో పలమనేరు ఏడీఈ కార్యాలయం, ఈఆర్ఓ కార్యాలయం, సేవాకేంద్రం ఉంటున్నాయి భవనం పైఅంతస్తులో ఈఆర్ఓ కార్యాలయం, కింది వైపు ఏడీఈ కార్యాలయం ఉంది. ఈ భవన నిర్వహణ గురించి రెండు దశాబ్దాలుగా ఎవరూ పట్టించుకొన్న పాపానపోలేదు. దీనికి తోడు నాలుగేళ్లక్రితం ఈ కార్యాలయం పైకప్పుపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేశారు. అయితే అధికారుల పర్యవేక్షణా లోపంతోపాటు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసే ప్రైవేటు వ్యక్తులు సరాసరి పైకప్పుకు డ్రిల్లింగ్ వేసి సోలార్ ప్యానల్స్ ఏర్పాటుచేసి వెళ్లిపోయారు. దీంతో పైకప్పు బీటలు బారిపోయింది. పైకప్పు కింది భాగం చిన్నపాటి వర్షం వచ్చినా ఉరుస్తోంది. అంతేకాక పైకప్పు కిందిభాగం పెచ్చులూడి పడిపోతోంది. దీంతో పైఅంతస్తులో విధులు నిర్వహిస్తున్న ఈఆర్ఓ కార్యాలయం సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఏ క్షణాన పైకప్పు పెచ్చులూడి తలపై పడుతుందో అని బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ భవనానికి మరమ్మతులు చేయడం లేదా కొత్త భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

తెలుగు భాషోద్ధారకుడు సీపీ బ్రౌన్



సమావేశంలో మాట్లాడుతున్న తులసినాథం నాయుడు

పలమనేరు, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): ఒక ఆంగ్లేయ అధికారిగా వుండి కూడా తెలుగు సాహిత్యానికి, భాషకు ఎనలేని సేవచేసిన సీపీ బ్రౌన్ తెలుగు భాషోద్ధారకుడు అని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు పి. తులసినాథం నాయుడు పేర్కొన్నారు. ఆదివారం ఇక్కడి కళామందిరంలో సీపీ బ్రౌన్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడెక్కడో పడి ఉన్న సాహిత్య గ్రంథాలన్నింటినీ సేకరించి తాళపత్రాల్లో అవసాన దశలో ఉన్న గ్రంథాలను సొంత డబ్బులు వెచ్చించి పండితులచే ముద్రించి తెలుగుజాతికి అందించిన తెలుగు సాహితీ కర్షుడు బ్రౌన్ అన్నారు. తెలుగువారి అపురూప సంపద వేమన పద్యాలను ముద్రించి మనకు అందించడమే కాక వాటిని ఆంగ్లభాషలోకి తర్జుమా చేసి విశ్వవ్యాప్తం చేశారన్నారు. బ్రౌన్ లేకుంటే మనకు అనేక గ్రంథాలు లభించేవి కాదన్నారు. ఈ నాటికి ప్రామాణికంగా వున్న తెలుగు, ఇంగ్లీషు, ఇంగ్లీష్ తెలుగు నిఘంటువులు బ్రౌన్ తయారు చేసినవే అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, చంద్రశేఖరయ్య, సయ్యద్ మొహిద్దీన్, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి, బోయ ఫెడరేషన్ ఛైర్మన్‌గా బుజ్జమ్మ వద్దు



బొజ్జమ్మను తొలగించాలని డిమాండ్ చేస్తున్న వాల్మీక సంఘ నాయకులు

పలమనేరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకేతరులైన బొజ్జమ్మను రాష్ట్ర వాల్మీకి, బోయ ఫెడరేషన్ ఛైర్మన్‌గా నియమించినందుకు వాల్మీకులు తీవ్రంగా మండిపడ్డారు. ఆదివారం పలమనేరులోని ఆర్అండ్‌బీ వసతి గృహం వద్ద వాల్మీకులు సమావేశమై ఈ విషయాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా సంవత్సరాలు తరబడి వాల్మీకుల సమస్యలపై, హక్కులపై ఉద్యమాలు, ఆందోళనలు చేసిన వారు ఎందరో వుండగా ఏకిల సామాజిక వర్గానికి చెందిన బొజ్జమ్మను రాష్ట్ర ఫెడరేషన్ ఛైర్మన్‌గా నియమించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. వెంటనే బొజ్జమ్మను తొలగించి వాల్మీకులను నియమించాలని వారు డిమాండు చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఎల్. భాస్కర్, మాజీ సర్పంచ్‌లు నాగరాజు, గంగప్ప, సుబ్రమణ్యం, రామచంద్రనాయుడు, శ్రీనివాసులు, గణపతి, వెంకటరమణ, గంగవరం బాలాజీ, శంకరప్ప, బాలక్రిష్ణ, ప్రభాకర్, మంజునాథ్, బాలకృష్ణ, నరసింహులు, మునస్వామి, మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకూ టీడీపీలో ప్రత్యేక గుర్తింపు



చౌడేపల్లె మండలం బత్తలాపురంలో టీడీపీ సభ్యత్వాలు చేస్తున్న నాయకులు

చౌడేపల్లె, నవంబర్10(ఆంధ్రజ్యోతి): ప్రతి కార్యకర్తకు టీడీపీలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని టీడీపీ రాజంపేట పార్లమెంట్ యువత అధికార ప్రతినిధి కళ్యాణ్ పేర్కొన్నారు. చౌడేపల్లె మండలం బత్తలాపురంలో ఆదివారం ఒక్కరోజులోనే 400 టీడీపీ సభ్యత్వాలు నమోదు చేశారు. అలాగే దుర్గసముద్రం పంచాయతీలో మైనార్టీ నాయకులు ఘని ఆధ్వర్యంలో 300 మంది సభ్యత్వాలు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జయరాం, రవి, సుధాకర్, సురేష్ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పం : టీడీపీ సభ్యత్వ నమోదు వల్ల కలిగే ఉపయోగాలను నేతలు, కార్యకర్తలు ప్రజలకు వివరించి వేగవంతం చేయాలని ఆ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పత్రనారాయణాచారి, రామకుప్పం మండలం అధ్యక్షుడు ఆనందరెడ్డి కోరారు. ఆదివారం రామకుప్పం, బల్ల, కొంగనపల్లె, పంద్యాలమడుగు, పీఎంకేతాండా, కెంచనబల్ల తదితర గ్రామాల్లో వారు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో నేతలు ఆంజినేయరెడ్డి, సీతాపతి, చలపతి, చిన్నికృష్ణ, రామూర్తి, శ్రీనివాసులురెడ్డి, మహ్మద్‌రఫీ. విశ్వనాథ్, వెంకటాచలం,వెంకటరమణ, చంద్రశేఖర్‌రెడ్డి, రామలింగారెడ్డి, బాలరాజు, సుబ్రీ, మంజునాథ్, మంజునాథరెడ్డి, జ్ఞానశేఖర్‌రెడ్డి, శ్రీనాథరెడ్డి, సురేష్, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

సోమల : నెల్లిమంద పంచాయతీలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు జరిగింది. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు సతీశ్, మాజీ సర్పంచు కొల్లా హరిప్రసాద్, నాయకులు పురుషోత్తం నాయుడు, గుర్రప్ప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న పూతలపట్టు ఎంపీపీ భర్త

చౌడేపల్లె, నవంబర్10:(ఆంధ్రజ్యోతి) పూతలపట్టు ఎంపీపీ కుమారి భర్త చంద్ర టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివార బోయకొండలో ఎమ్మెల్యే మురళి ఆయనకు టీడీపీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ..సీఎం చంద్రబాబుతోనే ఏపీ అభివృద్ధి చెందుతుందని నమ్మి టీడీపీలోకి వచ్చినట్లు తెలిపారు.

సోమల : పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్‌ను ఇరికిపెంటలో టీడీపీ నేతలు ఆదివారం సన్మానించారు. బోయకొండ గంగమ్మ ఆలయానికి వెళుతూ ఇరికిపెంట మాజీ సర్పంచు శ్రీనివాసులు నాయుడు స్వగృహంలో ఆయన మండల టీడీపీ నేతలతో ముచ్చటించారు. కార్యక్రమంలో గల్లా ధనుంజయ, గల్లా బోసు, శ్రీనివాసులు, సతీశ్, శివప్రసాద్, రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



చౌడేపల్లె, నవంబర్10(ఆంధ్రజ్యోతి) : స్థానిక హైస్కూల్‌లో 30 ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థుల కలయిక ఆదివారం జరిగింది. 1993-94 విద్యాసంవత్సరం చౌడేపల్లె హైస్కూల్‌లో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు అప్పటి వారి గురువులైన రాయపరెడ్డి, నాయుని చంద్రశేఖర్, కబీర్, బసవన్న, భాగ్యమ్మలను సన్మానించి, గురుపూజలు నిర్వహించారు. అనంతరం వారు అప్పటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని, ఒకరినొకరు క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకుని ఆనందంగా గడిపారు. తాము చదువుకున్న స్కూల్ అభివృద్ధి కృషి చేయనున్నట్లు తెలిపారు.

నేడు గ్రీవెన్స్ డే

కుప్పం, నవంబరు10(ఆంధ్రజ్యోతి): కుప్పం మండల సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో జరుగుతుంది. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాని పీడీ కోరారు.

పీఎస్ఎం, శాంతారాంలకు సన్మానం



కుప్పం రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంగుంది పంచాయతీలో ఆదివారం ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాంలను టీడీపీ శ్రేణులు ఘనంగా సత్కరించాయి. వారు మాట్లాడుతూ తమ పదవులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

కుప్పంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్



కుప్పం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరిధిలో 2025-26 నూతన విద్యా సంవత్సరానికి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రారంభించనున్నట్లు ఫ్రాన్స్‌కు చెందిన మిస్టర్ ఫ్రాంక్, స్కూల్ ఛైర్మన్ బీఎం.దయానిధి తెలిపారు. కుప్పంలో వారిద్దరూ ఆదివారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుప్పం పట్టణంలో ప్రారంభించనున్న ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఇంటర్నేషనల్ కరికులం, సీబీఎస్ఈ, కార్యాచరణ ఆధారిత సిలబస్ ప్రత్యకతలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఆర్ఎం బోధన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



సదుం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కళాశాలకు వెళతానని ఇంటి నుంచి బయలుదేరిన ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. కుటుంబీకుల కథనం మేరకు... సదుం గ్రామం కోటగేడ సందు వీధిలో ఉంటున్న మంజునాథ్ మేనల్లుడు క్రాంతి కుమార్, కలికిరిలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుకుంటున్నాడు. రోజులాగా శనివారం కళాశాలకు వెళుతున్నానంటూ వెళ్లిన అతను ఆ రాత్రి ఇంటికి రాకపోవడంతో పరిసర ప్రాంతాల్లోని బంధువుల ఇళ్లలో వెతికారు. ఎంతకూ ఆచూకీ తెలియక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రతి నెలా కంటి పరీక్షలు

పుంగనూరు రూరల్, నవంబరు10(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా రెండవ ఆదివారం పుంగనూరు లయన్స్ క్లబ్, కుప్పం పీఈఎస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్లు చేస్తున్నట్లు లయన్స్‌క్లబ్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ శివ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పుంగనూరు పట్టణ సమీపంలోని రాంపల్లె వద్ద ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రంలో ప్రతి రోజు 35మందికి ఉచితంగా చికిత్సలు అందిస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

క్యాన్సర్ ప్రాథమిక పరీక్షలు

సదుం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): చెరుకువారిపల్లె పీహెచ్‌సీ పరిధిలో డా.గిరీషా ఆధ్వర్యంలో క్యాన్సర్ లక్షణాల ప్రాథమిక పరీక్షలను వైద్య ఆరోగ్య సిబ్బంది నిర్వహించారు. క్యాన్సర్ ప్రాణాంతకం కాదని, ప్రాథమిక దశలో గుర్తిస్తే సరైన వైద్యం ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని గ్రామస్తులకు వారు తెలియజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఉదయ్ కుమార్, నీలకంఠ, శిఖామణి, నాగరత్న, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్లూరులో చౌక బియ్యం స్వాధీనం

కల్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణంలో ఆదివారం 1200 కిలోల చౌక బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సయ్యద్‌బాషా ఇంట్లో 400 కిలోలు, నటరాజ ఇంట్లో 800 కిలోల చౌకబియ్యాన్ని పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకొని పోలీస్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బోయకొండ గంగమ్మ సేవలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళి



చౌడేపల్లె, నవంబర్10 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మను పూతలపట్టు ఎమ్మెల్యే మురళి దర్శించుకున్నారు. ఆదివారం ఆయన అమ్మవారి దర్శనం కోసం రాగా ఈవో ఏకాంబరం స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందించారు. ఆయనను స్థానిక టీడీపీ నాయకులు పగడాల హరిప్రసాద్, సాగర్, రామకృష్ణ, గౌతమ్‌తోపాటు పలువురు టీడీపీ నాయకులు పూలమాలలతో సన్మానించారు.

మూత్రశాలలకు మోక్షమెప్పుడో ?



పలమనేరు ఆర్టీసీ బస్టాండులో ఆరేళ్ల క్రితం మూత్రశాలలు నిర్మించారు. మహిళలకు మూడు, పురుషులకు రెండు చొప్పున నిర్మించిన ఈ మూత్రశాలలను ప్రారంభించక ఇప్పటికీ తాళాలు వేసి వుంచారు. పలమనేరు ఆర్టీసీ బస్టాండుకు ప్రతిరోజు వేలాది మంది ప్రయాణీకులు వివిధ ప్రాంతాలనుంచి వస్తుంటారు. వీరు బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ మూత్రశాలను వినియోగానికి తీసుకు రావాలని ప్రయాణీకులు కోరుతున్నారు. - పలమనేరు

టీడీపీ నేతల చొరవతో రోడ్డు పనులు



టీడీపీ నాయకులు చొరవ తీసుకుని పుంగనూరు - బెంగళూరు రోడ్డు మరమ్మతు పనులను చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు గుంతలు పడి ప్రజలు, వాహనదారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా టీడీపీ నాయకులు రెడ్డెప్పయాదవ్ గుంతలకు మట్టి వేసి గుంతలను పూడ్చారు.
- పుంగనూరు

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు ఘన స్వాగతం



రేణిగుంట విమానాశ్రయంలో భానుప్రకాష్‌కు స్వాగతం పలుకుతున్న నగరి టీడీపీ నాయకులు

నగరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన సందర్భంగా రేణిగుంట విమానాశ్రయంలో ఆయనకు ఆదివారం నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లు ఘన స్వాగతం పలికారు. టీడీపీ నాయకులు ఆయన్ను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. చిత్తూరు పార్లమెంటరీ అధికార ప్రతినిధి చినబాబు, రాష్ట్ర టీఎస్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు చిట్టి, నాయకులు కృష్ణారెడ్డి, జ్యోతి నాయుడు, గుణశేఖర్, రాజశేఖర్, మురళిరెడ్డి, మణిరెడ్డి, కన్నెప్ప, మోహన్, ఆకుల అశోక్, వెంకీ, గణేశ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఆర్ రాజన్, కటారి హేమలతలకు సన్మానం



సీఆర్ రాజన్‌ను సన్మానిస్తున్న టీడీపీ నేతలు కృష్ణమ నాయుడు, శ్రీధర్ యాదవ్, బాబు నాయుడు

చిత్తూరు సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవులు పొందిన టీడీపీ నేతలకు అభినందనలు వెల్లువెత్తాయి. మాజీ మేయర్, టీడీపీ చిత్తూరు నగర పార్టీ అధ్యక్షురాలు కటారి హేమలత చిత్తూరు అర్బన్ అథారిటీ డెవలప్మెంట్ (చుడా) చైర్మన్‌గా, టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్‌ను వన్నియకుల క్షత్రియ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించిన సంగతి తెలిసిందే. ఆదివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో సీఆర్ రాజన్‌కు, ఎంజీఆర్ వీధిలోని కటారి హేమలత కార్యాలయంలో కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వారికి దుశ్శాలువలు కప్పి, పుష్పగుచ్ఛాలు ఇచ్చి, పూలమాలలువేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పెద్దఎత్తున కూటమి నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: జిల్లా టీడీపీ కార్యాలయంలో గంగాధరనెల్లూరు నియోజకవర్గానికి చెందిన పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు, జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, పెనుమూరు మాజీ ఎంపీపీ హరిబాబు నాయుడు, సింగిల్ విండో సొసైటీ మాజీ వైస్ చైర్మన్ బాబు నాయుడు శాలువాలు కప్పి గజమాలతో సన్మానించారు. టీడీపీ నేతలు సునీల్‌చౌదరి, మోహన్‌రాజ్, కిషోర్, విజయకుమార్, ముకుందరాయనిపేట రామ్మూర్తిరెడ్డి పాల్గొన్నారు.

గుడిపాల: సీఆర్ రాజన్‌ను, కటారి హేమలతలను ఆదివారం మాజీ జడ్పీటీసీ సుమతి మురళీనాయుడు కలిసి శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పళని, టీడీపీ నాయకులు అర్జున్, మోహన్, కార్తిక్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

182 క్లెయిమ్‌ల స్వీకరణ



యు.ఎం.పురంలో ఎన్నికల డీటీకి నివేదిక అందజేస్తున్న బీఎల్వో

గంగాధరనెల్లూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఆరు మండలాల పోలింగ్ కేంద్రాల వద్ద నిర్వహించిన స్పెషల్ క్యాంపెయిన్ కార్యక్రమంలో రెండవరోజు 182 క్లెయిమ్‌లను స్వీకరించినట్లు ఎన్నికల డీటీ కరణం మోహన్‌రాజ తెలిపారు. ఆదివారం ఆయన గంగాధరనెల్లూరు, శ్రీరంగరాజుపురం మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి, అక్కడ విధుల్లో ఉన్న బీఎల్వోల దగ్గర వివరాలు అడిగి తెలుసుకున్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం



వెదురుకుప్పం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. పుత్తూరు పట్టణానికి చెందిన యుగంధర్ ఉభయదారుగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యార్థినికి సన్మానం



విద్యార్థిని మెహజ్ అబిన్‌ను సన్మానిస్తున్న ముస్లిం జేఏసీ నాయకులు

బంగారుపాళ్యం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖ వారు సైబర్ క్రైమ్‌పై జిల్లా స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించగా, బంగారుపాళ్యం మండలంలోని సెయింట్ మేరి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినీ మెహజ్ అబిన్ జిల్లాస్థాయిలో రెండవ స్థానంలో నిలిచి ఎస్పీ మణికంఠ చందోలు చేతులమీదుగా బహుమతిని అందుకుంది. ఆదివారం ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో ఆ బాలికను సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో మండలస్థాయి ముస్లిం జేఏసీ నాయకులు షౌకత్, అన్ను, ఉమర్ సాహెబ్, బాబు, రియాజ్ పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

బంగారుపాళ్యం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): చెన్నై శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మురళీకృష్ణ తెలిపారు. ఈ శిబిరానికి ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని రావాలని తెలిపారు. కంటి శస్త్రచికిత్స అవసరమైన వారిని చెన్నైలోని శంకర నేత్రాలయకు తీసుకెళ్లి శస్త్రచికిత్సలు చేయించి మరలా ఇంటికి తీసుకొచ్చి వదులుతారని తెలిపారు.





ఇళ్ల పక్కనే మురుగు గుంత - వీధిలో పేరుకుపోయిన చెత్తా చెదారం

మురుగు, దుర్గంధం నడుమ జీవనం

శివాజీనగర్‌వాసుల గోడు

చిత్తూరు అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలోని విజయా డెయిరీ క్వార్టర్స్ ఎదురుగా శివాజీనగర్ ఉంది. ఇక్కడ 50 కుటుంబాలకుపైగానే నివాసముంటున్నారు. స్థానికులంతా చిన్న చిన్న పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ కాలువలను నిర్మించడంలో అధికారులు విఫలమయ్యారు. ప్రధాన రహదారిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వెళుతున్నప్పటికీ దానికి ఇక్కడి నివాసాల నుంచి వచ్చే మురుగును అనుసంధానం చేయకుండా వదిలేశారు. దీనివల్ల నివాసాల మధ్య మురుగు స్తంభించి, వర్షపు నీటితో కలిసి దుర్గంధం వెదజల్లుతోంది. దోమల బెడదా అధికమై డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలుతున్నాయి.

డయల్ యువర్ ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేసినా..

డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి స్థానికులు ఫిర్యాదు చేస్తే మాత్రం పారిశుధ్య కార్మికులు ఆయిల్స్ బాల్స్ చల్లి వెళ్లిపోతున్నారు. శాశ్వత పరిష్కారం చూపడం లేదు.

మృతదేహాల దహనంతోనూ దుర్గంధం

కాలనీ విస్తరించకముందు చివర్లో శ్మశానం ఉండేది. ఇప్పుడు దాదాపు శ్మశానాన్ని ఆనుకుని నిర్మాణాలు వచ్చేశాయి. మృతదేహాలను దహనం చేసే సమయంలో పొగతోపాటు వచ్చే దుర్గంధాన్ని కాలనీవాసులు భరించలేకపోతున్నారు. కొందరైతే మృతదేహాలను దహనం చేసే సమయంలో బంధువుల ఇళ్లకు వెళ్లిపోతున్నారు.

పాళ్యంకొండ ఆలయ అభివృద్ధికి సహకరించండి



అభివృద్ధి పనులపై చర్చిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గుడిపాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏఎల్‌పురం - నారగల్లు మధ్యలో వున్న పాళ్యంకొండ ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు గుర్రప్ప నాయుడు, ఉపాధ్యక్షుడు మోహన్ నాయుడు, కార్యదర్శి తారకరామ్ కోరారు. ఆదివారం ఏఎల్‌పురం ఓంశక్తి ఆలయం వద్ద కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిసెంబరులో కార్తీక దీపోత్సవానికి అవసరమైన పనులను వేగవంతం చేయాలని తీర్మానించారు. 14 గ్రామాలకు సంబంధించిన పాళ్యంకొండ ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించి త్వరితగతిన పూర్తిచేసేవిధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు రాజగోపాల నాయుడు, రమేష్, రాజు, భూపాల నాయుడు, చిట్టిబాబు, గిరి, బాషా తదితరులు పాల్గొన్నారు.

దేశ ఐకమత్యాన్ని కోరుకున్న సమైఖ్యవాది మౌలానా

చిత్తూరు సిటీ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దేశ ఐకమత్యాన్ని కోరుకున్న సమైఖ్యవాది మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ మైనారిటీ దినోత్సవం సందర్భంగా మౌలానా సేవలను స్మరించుకోవాలని తెలిపారు. విద్యతోనే మనిషి అభివృద్ధి చెందుతాడని నిరూపించిన గొప్ప విద్యావేత్త కలాం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

ముగిసిన గ్లోబల్ అఖండనామ సంకీర్తన



చిత్తూరు కల్చరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న సత్యసాయిబాబ గ్లోబల్ అఖండ నామ సంకీర్తన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. గిరింపేట సత్యసాయి సంస్థాన్, కొంగారెడ్డిపల్లె ఉషానగర్ కాలనీ, సంతపేట, ప్రశాంత్‌నగర్ కాలనీల్లో 24 గంటలపాటు సత్యసాయి సేవాసమితి, భజనమండలి, బాలవికాస్ సభ్యులు పాల్గొని బాబా సంకీర్తనలు ఆలపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేటి నుంచి భగవత్ వైభవం ప్రవచన కార్యక్రమం

చిత్తూరు కల్చరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరపాలక నాగయ్య కళాక్షేత్రంలో సోమ, మంగళ వారాల్లో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త రాధా మనోహర్‌దాసుచే భగవత్ వైభవం ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నారు. చిత్తూరు నారాయణి సేవాసమితి ఆధ్వర్యంలో ఈకార్యక్రమం రోజూ సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్నామని నిర్వాహకులు కళ్యాణ్ చక్రవర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

200 మందికి వైద్య పరీక్షలు




శిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

శ్రీరంగరాజపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం 49.కొత్తపల్లె మిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హ్యూమన్‌రైట్ సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి మాధురి రెమెడీ హాస్పటల్ వారిచే ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాధురి హాస్పిటల్ చైర్మన్ మాధురీ గాంధీ, జనరల్ ఫిజీషియన్ ఆంజనేయులు, జనరల్ సర్జన్ హరిదీప్, ఆర్‌వో కళావతి, పీఆర్‌వో సునీత, హ్యూమన్‌రైట్ సంఘం వైస్ అధ్యక్షుడు డిల్లీబాబు, సభ్యులు చంద్రశేఖర్, గోవిందరాజులు, అలఅబ్బాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా నాగరాజు బాధ్యతల స్వీకరణ



వెదురుకుప్పం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం తహసీల్దార్‌గా నాగరాజు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. పాలసముద్రం డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న నాగరాజు కార్వేటినగరం తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ భగవతి ఐదు నెలల పాటు దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు.



హైస్కూల్ ప్లస్‌ను జూనియర్ కాలేజీగా మార్చాలి



మాట్లాడుతున్న జయప్రకాష్ నాయుడు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో గత ప్రభుత్వం తెచ్చిన హైస్కూల్ ప్లస్‌లను జూనియర్ కళాశాలలుగా మార్చాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ నాయుడు అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులను ఖచ్చితంగా అమలుచేయాలని కోరారు. ప్రతి కళాశాలలోనూ సబ్జెక్టు వారీగా సరిపడా అధ్యాపకులను నియమించాలని, లైబ్రరీతో పాటు సైన్స్‌ల్యాబ్‌ల ఏర్పాటు, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేసి కళాశాలలను బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు తీర్మానాన్ని ప్రభుత్వానికి పంపనునట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి రామయ్య, దామోదర్‌రెడ్డి, వెంకటేశులు, సోమశేఖర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్‌లో కార్డన్ సెర్చ్



కాలనీవాసులకు కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ నెట్టికంఠయ్య

చిత్తూరు అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రశాంత్‌నగర్‌లో ఆదివారం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య, ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది కలిసి ప్రశాంత్‌నగర్‌లోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రికార్డులు సరిగ్గా లేని 26 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రికార్డులను చూపించిన వారికి తిరిగి వాహనాలను అప్పగించారు. చాలా మంది కొన్న వాహనాలను వారి పేర్ల మీదుగా మార్చుకోకుండా ఉన్నారని, అలాంటి వారిని హెచ్చరించి త్వరలో మార్చుకోమని చెప్పడంతో పాటు జరిమానా వేశామని ఎస్ఐ తెలిపారు.

శాలివాహన కులస్తుల సంక్షేమానికి కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న శాలివాహన కుల సంఘ నాయకులు


చిత్తూరు రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): శాలివాహన కులస్తుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిశేషయ్య కులసంఘ నాయకులకు పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో శాలివాహన కులస్తుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆదిశేషయ్య మాట్లాడుతూ కమిటీ సభ్యత్వ నమోదు, కమిటీ ఏర్పాటుపై పలు సూచనలు చేశారు. జిల్లాలో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి స్థల సేకరణ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు దామోదరం, దేవరాజులు, మల్లయ్య, రత్నశేఖర్, ఉదయ్, వెంకటేశ్వర్లు, నాగరాజు, చలపతి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

భూఆక్రమణలను అరికట్టాలి: సీపీఎం



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నగరి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరి పట్టణ పరిధిలోని సత్రవాడలో జరిగిన భూఆక్రమణలను తొలగించాలంటూ సీపీఎం నేత వాడ నాగరాజు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం సత్రవాడలో ప్రజా పోరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్రవాడలో గ్రామకంఠం, కాలువ పోరంబోకు భూములను కొంతమంది ఆక్రమించుకున్నారని, రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారేగానీ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. గ్రామ అవసరాల కోసం గ్రంథాలయం, ఆటస్థలానికి భూమి కేటాయించమంటే అధికారులు భూమి లేదని కుంటి సాకులు చెబుతున్నారన్నారు. శ్మశాన స్థలం ఆక్రమణకు గురైనా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.



క్రీడలతో మానసికోల్లాసం



వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే యువతలో మానసిక ఉల్లాసం సాధ్యమని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. నగరి డిగ్రీ కళాశాల సమీపంలో సెవెన్ కె వారియర్స్ బాక్స్ క్రికెట్ ప్రాంగణాన్ని ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నగరిలో ఇలాంటి క్రీడాప్రాంగణాలు ప్రారంభం కావడం ఆనందదాయకమన్నారు. అనంతరం అయనంబాకంలో నారాయణాద్రి వైద్యశాల సిబ్బందితో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో పాల్గొన్నారు. నగరి పీఏసీఎస్ మాజీ చైర్మన్ సురేష్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 300 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం దేశూరు అగరంలో అయ్యప్పస్వామి ఆలయాన్ని సందర్శించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై అందించే వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. చిత్తూరు పార్లమెంటరీ టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, నాయకులు సురేష్ నాయుడు, బాలాజీ, మీరా, చిట్టి, ఐవీ నాయుడు, ఉమాపతిరాజు, ధనంజయరాజు, జవహర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

